సాక్షి
విశాఖపట్నం

శనివారం। 12। ఆగస్టు। 2023

పవన్.. గీతం ఆక్రమణలు కనబడలేదా?

- రుషికొండపై ప్రభుత్వ నిర్మాణాల విషయంలో నానా యాగీ
- ఎదురుగా ఉన్న 'గీతం' భూ ఆక్రమణాలపై పెగలని నోరు
- టీడీపీ పాలనలో పెందుర్తిలో వివస్త్రను చేసిన దళిత మహిళ కుటుంబాన్ని పరామర్శించవా?
- జనసేన అధ్యక్షుడి తీరుపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజలు

దొండపర్తి: నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్టుంది జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యవహార శైలి. రుషికొండపై ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు జరుగుతుంటే నానా యాగీ చేస్తున్న పవన్ కల్యాణ్‌కు.. దాని ఎదురుగా ఉన్న గీతం భూ ఆక్రమణలు మాత్రం కనిపించలేదు. ఒక మూలన కూర్చోకుండా ముఖ్యమంత్రికి భారీ భవనాలు కావాలా? అని ఎద్దేవా చేసిన పవన్.. టీడీపీ నేతలు చేసిన రూ.వందల కోట్లు విలువైన భూకబ్జాలపై ఎందుకు ప్రశ్నించలేదు? ఇదే ఇప్పుడు అందరిలోనూ రేకెత్తిస్తున్న ప్రశ్న. రుషికొండను అన్యాక్రాంతం చేస్తున్నారని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ వాటి సందర్శనకు వెళ్లిన పవన్‌కల్యాణ్ శుక్రవారం హడావుడి చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ మంది మార్బలంతో వెళ్లేందుకు సమాయత్తమయ్యారు. అయితే పవన్ హడావుడికి నగర పోలీసులు బ్రేక్ వేశారు. రుషికొండ సందర్శనకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులతో వెళ్లేందుకు అనుమతివ్వలేదు. పవన్ వాహనంతో పాటు మరో ఏడు వాహనాలకు మాత్రమే అనుమతిస్తామని తేల్చి చెప్పారు. దీంతో సాయంత్రం 5 గంటలకు పవన్ కల్యాణ్ ముఖ్య నేతలతో కలిసి గీతం యూనివర్సిటీ చుట్టూ తిరుగుతూనే రుషికొండపై జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. కానీ గీతం యూనివర్సిటీ ఆక్రమించిన 40 ఎకరాల వైపు మాత్రం కన్నెత్తి చూడకపోవడం.. పల్లెత్తు మాట అనకపోవడం అందరినీ విస్తుపోయేలా చేసింది.

టీడీపీ భూకబ్జాలపై నోరెందుకు పెగలదు?

రుషికొండ ప్రాంతంలో పవన్ వ్యవహార శైలి, చేసిన వ్యాఖ్యలపై ప్రజలు మండిపడుతున్నారు. ఒకవైపు టీడీపీ నేతలు రూ.వందల కోట్లు విలువ చేసే భూములను కబ్జా చేస్తే పట్టించుకోని పవన్.. ప్రభుత్వ స్థలంలో.. ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలపై ఆరోపణలు చేయడం పట్ల ఆ పార్టీ నేతలే కొందరు తప్పుపడుతున్నారు. ప్రభుత్వ భవనాలు వ్యక్తిగతం కాదన్న విషయం తెలిసినప్పటికీ.. రుషికొండను అన్యాక్రాంతం చేస్తున్నారని మాట్లాడడం పవన్ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే రుషికొండపై జరుగుతున్న నిర్మాణాలను చూసిన అనంతరం ఏం మాట్లాడాలో తెలియక పవన్ మల్లగుల్లాలు పడ్డారు. అక్కడ అన్నీ ప్రభుత్వ భవన నిర్మాణాలే జరుగుతుండడంతో మాటల్లేక తడబడ్డారు. మీడియా ప్రశ్నలకు ఊగిపోతూ వింతవింతగా సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రిపై నోరుపారేసుకున్నారు. విపత్తుల నుంచి విశాఖను రుషికొండ కాపాడుతోందని, దాన్ని తొలిచేస్తున్నారని పవన్ కొత్త భాష్యం చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి ఒక మూలన కూర్చుంటే సరిపోదా? భారీ భవనాలు ఎందుకని వింత వ్యాఖ్యలు చేశారు.

దళిత మహిళ వివస్త్ర ఘటనపై మాట్లాడవా?

పెందుర్తిలో బంగారం కోసం హత్యకు గురైన వృద్ధురాలు కుటుంబాన్ని పరామర్శించడానికి సిద్ధమైన పవన్ కల్యాణ్.. టీడీపీ హయాంలో దళితుల భూములను ఆక్రమిస్తూ.. ఒక దళిత మహిళను వివస్త్రను చేసిన వ్యవహారంలో బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించరా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2017 డిసెంబర్ 19న టీడీపీ నేతలు పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో సర్వే నంబర్ 77లో 14 మంది దళితులకు చెందిన 80 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో దళిత కుటుంబాలు వారిని నిలువరించే ప్రయత్నం చేయగా టీడీపీ నాయకులు వారిపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఆర్.దుర్గమ్మ అనే మహిళను నడిరోడ్డుపై వివస్త్రను చేసి పరుగులు పెట్టించారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం రేపింది. అయినప్పటికీ పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ బాధిత కుటుంబాలకు న్యాయం చేయలేదు. టీడీపీ నేతలను అరెస్ట్ చేయలేదు. దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్ రాములు పెందుర్తి వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు. తెలుగుదేశం నాయకులు చేసిన దుర్మార్గాన్ని తెలుసుకున్నారు. దళితులపై దాడులకు పాల్పడినప్పటికీ, మహిళను వివస్త్రను చేసినప్పటికీ పోలీసులు ఏ ఒక్కరినీ అరెస్ట్ చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. వెంటనే ఆ స్థలాన్ని అన్ని హక్కులతో బాధిత దళిత కుటుంబాలకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే బాధిత మహిళ దుర్గమ్మతో పాటు దాడికి గురైన దువ్వాడ అక్కమ్మకు చెరో రూ.8 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనపై జాతీయ కమిషన్ కూడా విశాఖ రాగా.. పవన్ కల్యాణ్ మాత్రం ఇప్పటి వరకు ఆ ఘటనపై నోరు మెదపలేదు. ఇప్పుడు పెందుర్తిలో హత్యకు గురైన వృద్ధురాలి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు టీడీపీ ప్రభుత్వంలో వివస్త్రను చేసిన దళిత మహిళ కుటుంబ సభ్యులను కూడా పరామర్శిస్తారా? కనీసం ఆ ఘటనపై నోరు విప్పుతారో లేదో చూడాలి.



రుషికొండలో పర్యటిస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

శాంతియుతంగా నిరసన తెలిపితే కేసులా?

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

కొమ్మాది: ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. రుషికొండపై జరుగుతున్న నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి.. తుపాన్ల నుంచి కొండలు రక్షిస్తాయని.. అలాంటి కొండలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుల్ల చేస్తోందన్నారు. ఈ కొండపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు హెచ్చరించినా.. నిర్మాణాలు ఆపడం లేదన్నారు.

జనసేన కార్యకర్తల అతి

ఆరిలోవ: జనసేన పార్టీ కార్యకర్తలు జోడుగుళ్లపాలెం కూడలి వద్ద అతి చేశారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెంటే తమ వాహనాలను విడిచిపెట్టాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పవన్ కల్యాణ్ బస చేసిన హోటల్ నుంచి శుక్రవారం సాయంత్రం ర్యాలీగా అప్పుఘర్, జోడుగుళ్లపాలెం, సీతకొండ, సాగర్‌నగర్ మీదుగా రుషికొండ బయలుదేరారు. సాయంత్రం 5.10 గంటలకు జోడుగుళ్లపాలెం వద్దకు చేరుకున్నారు. దీంతో కొందరు కార్యకర్తలతో పాటు అభిమానులు గుంపులుగా అతను ప్రయాణించే వాహనం చుట్టూ చేరారు. అక్కడ పవన్ కల్యాణ్ కారు దిగి అభిమానులకు అభివాదం చేశారు. దీన్ని గమనించిన ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు వెంటనే పవన్ కల్యాణ్ వద్దకు వెళ్లి.. ఇక్కడ ఆగితే లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందని చెప్పారు. వెంటనే ఆయన కారు లోపలకు వెళ్లి.. రుషికొండ బయలుదేరారు. నిబంధనల మేరకు వాహనాలను ఆయన వెంట అనుమతించారు. అయితే తమ వాహనాలను అనుమతించాలని పలువురు కార్యకర్తలు నానా హడావిడి చేశారు. పవన్ ర్యాలీ ఇక్కడకు చేరడానికి 10 నిమిషాల ముందు యలమంచిలికి చెందిన నాయకుడు విజయ్‌కుమార్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. పలువురు జనసేన కార్యకర్తలు వాహనాల హారన్లు మోగిస్తూ న్యూసెన్స్ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాధారణ ప్రజల వాహనాలను జోడుగుళ్లపాలెం వద్ద విశాలాక్షినగర్ మీదుగా హనుమంతవాక హైవేకి తరలించారు.



జోడుగుళ్లపాలెం వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసేన నాయకుడు

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో అన్ని జోన్లలో కోట్లాది రూపాయలతో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాలో 48 అంశాలు పొందుపరిచారని, అందులో అన్ని అంశాలను సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.8.29 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి రూ.73.15 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగానికి రూ.65.55 లక్షల పనులు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపులతో పాటు తదితర అంశాలు ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్జీవీ కృష్ణ, సింహాచలం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డీసీపీలు పాల్గొన్నారు.

పాలిసెట్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. అభ్యర్థులు వారి ఇంటి నుంచే నేరుగా ఇంటర్నెట్ ద్వారా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. అయినప్పటికీ కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలల్లోని హెల్ప్‌లైన్ కేంద్రాలకు విద్యార్థులు వచ్చి.. స్థానిక సిబ్బంది సహాయంతో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, గైస్‌లో ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వెబ్ ఆప్షన్లకు గడువు ఈ నెల 14 వరకు ఉంది. 16న ఆప్షన్ల మార్పు చేసుకోవచ్చు. 18న సీట్ల కేటాయింపు, 19 నుంచి 23వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

న్యూస్‌రీల్

రూ.1,204.04 కోట్లతో విశాఖ పోర్టులో ప్రాజెక్టులు

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం పోర్టులో రూ.1,204.04 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ ప్రాజెక్టుల అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

నైపుణ్యాభివృద్ధికి టీఆర్‌ఈఐతో గైస్ ఒప్పందం



టీఆర్‌ఈఐ కంపెనీ ప్రతినిధులతో పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అచ్యుతాపురంలోని టయోట్స్ రేర్ ఎర్త్స్ ఇండియా(టీఆర్‌ఈఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇండస్ట్రీ కనెక్ట్‌లో భాగంగా ఆ కంపెనీ ప్రతినిధులతో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సమక్షంలో కాలేజీ ప్రతినిధులు శుక్రవారం అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నారు. కరికులం డిజైన్, విద్యార్థులకు, ట్రైనర్లకు శిక్షణ, జాయింట్ సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక శిక్షణ, ఇండస్ట్రియల్ ట్రైనింగ్, గెస్ట్ లెక్చరర్స్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను టీఆర్‌ఈఐ నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీ కోయిచీ సాతో, సీనియర్ జీఎం డాక్టర్ మురళీధరరావు, కాలేజీ టీపీవో కుమార్ పాల్గొన్నారు.

14న పాత ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా



కంచరపాలెం: కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-4 ఉపసంచాలకుడు ఆర్.జి.రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, ఐటీఐ పూర్తి చేసిన అన్ని ట్రేడుల అభ్యర్థులు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు, సీఎస్‌సీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో కోరమండల్, మైలాన్, వరుణ్ మోటార్స్, జయభేరి, జిందాల్ స్టీల్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు 18కి పైగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరుకావాలని సూచించారు.

13న ఎన్‌సీఎల్‌టీ జ్యుడీషియల్ సభ్యుడి రాక

మహారాణిపేట: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) జ్యుడీషియల్ సభ్యుడు డాక్టర్ ఎన్.వెంకట రామకృష్ణ బదరీనాథ్ ఈ నెల 13న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఆ రోజు ఉదయం 10.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు విమానంలో తిరిగి హైదరాబాద్ వెళతారు.

రెవెన్యూ శాఖలో పదోన్నతులు



పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఉద్యోగాల్లో పదోన్నతులు పొందిన వారు అంకితభావంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎనిమిది మంది వీఆర్‌వోలు, 12 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు పదోన్నతులు కల్పించారు. వీరికి జేసీ తన చాంబర్‌లో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టైపిస్టులు శ్రద్ధగా విధులు నిర్వర్తించాలన్నారు. డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఆడిట్‌తో వ్యాపారం సులభం

జీఎస్టీ ఇంటెలిజెన్స్ డీజీ ఎంఆర్‌ఆర్ రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: జీఎస్టీ ఆడిట్‌ను పాటించడం వల్ల వ్యాపారం సులభం అవుతుందని విశాఖ జోన్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ఎంఆర్‌ఆర్ రెడ్డి అన్నారు. జీఎస్టీ డిపార్ట్‌మెంటల్ ఆడిట్ అనేది సంబంధిత సంస్థ రికార్డులు, రిటర్న్‌లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించే ప్రక్రియగా పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జీఎస్టీ డిపార్ట్‌మెంట్ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ విభాగం వినియోగదారులకు అనుకూలమని, దీనిపై తాము తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆడిట్ ముగిసిన తర్వాత అధీకృత అధికారి గుర్తించిన విషయాలను 30 రోజుల్లో తెలియజేస్తారన్నారు. సీఐఐ విశాఖ చైర్మన్ పీపీ లాల్ మాట్లాడుతూ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై సంప్రదింపుల ద్వారా రిటర్న్ ఫైలింగ్ ఫార్మాట్‌ను సులభతరం చేయడం అభినందనీయమన్నారు. జీఎస్టీ ఆదాయంలో 22 శాతం వృద్ధి ఆర్థికాభివృద్ధిని సూచిస్తుందన్నారు. సీఐఐ విశాఖ ఫైనాన్స్, ట్యాక్సేషన్ ప్యానెల్ కన్వీనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ రిటర్న్‌లను నిర్ణీత సమయానికి దాఖలు చేయడం అలవరచుకోవాలని సూచించారు. పీబీఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ పి.రాజేష్, హెచ్ఎస్ఏ అండ్ కో పార్టనర్‌లు ఆశీష్‌చౌదరి, విక్రమ్ కటారియా, సీఐఐ విశాఖ వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంఆర్‌ఆర్ రెడ్డి

లబ్ధిదారులకు రెండు నెలల్లో టిడ్కో గృహాలు

దొండపర్తి: విశాఖలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను రెండు నెలల్లో లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భానోజీతోట, అచ్చంనాయుడు లోవ, పెదగంట్యాడ బీసీ కాలనీ, మూలగాడలే అవుట్లలో తుది దశకు చేరుకున్న టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా రానున్న రెండు నెలల్లో టిడ్కో గృహ నిర్మాణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మంచినీటి సౌకర్యాలతో పాటు డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తుది దశలో ఉన్న 10 వేల గృహాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించే విషయంలో సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ మల్లికార్జున
- సున్నా వడ్డీ పథకంలో 31,660 మందికి రూ.49.78 కోట్ల లబ్ధి

మహారాణిపేట: మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల మహిళలపై వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే ఆ మొత్తం చెల్లిస్తూ.. అండగా నిలుస్తోందని చెప్పారు. వైఎస్సార్ సున్నావడ్డీ పథకంలో భాగంగా నాలుగో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురంలో శుక్రవారం మహిళల ఖాతాలో జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, కలెక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు పొదుపు సంఘాల మహిళలు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని.. అందులో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ఒకటన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదా చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని 31,660 స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు నాలుగో విడత సాయంలో భాగంగా రూ.49.78 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. రూరల్ పరిధిలోని ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 4,887 స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాల్లో రూ.7.03 కోట్లు, అర్బన్ పరిధిలో 26,773 సంఘాలకు రూ.42.75 కోట్లు జమయ్యాయని తెలిపారు. అనంతరం మహిళా సంఘ సభ్యులకు ప్రజాప్రతినిధులతో కలిసి సున్నావడ్డీ పథకం మెగా చెక్కును అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, యూసీడీ పీడీ కె.వి.పాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

వ్యాపారానికి ఊతం



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడతలో రూ.12,500 లబ్ధి చేకూరింది. ఈ డబ్బుతో ఇప్పటికే నడుస్తున్న పాల వ్యాపారాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాను. నాన్నకు ఒకటో తేదీనే వలంటీర్ పింఛన్ ఇస్తున్నారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో బాగున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఎ.మణి, రేఖవానిపాలెం

వడ్డీ భారం లేదు



వడ్రంగి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా అందుతున్న సొమ్ము మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వడ్డీ భారం మాపై పడకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఈ డబ్బులు పనిముట్లు కొనుగోలుకు ఉపయోగించుకుంటా. నా కుమారుడికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోంది. అమ్మకు వైఎస్సార్ పింఛన్ అందుతోంది. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి చేకూరింది.

– కె.జానకి, వేములవలస

థ్యాంక్యూ సీఎం సార్..



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, మహిళలు

సీతమ్మధార: వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ ఉత్తర కార్యాలయం ఆవరణలో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎన్.శశికళ, బర్కత్ ఆలీ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, డైరెక్టర్ పైడి శ్రీను, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫెన్సింగ్ జట్ల ఎంపిక

నేడు, రేపు భీమవరంలో రాష్ట్ర స్థాయి పోటీలు

మధురవాడ(భీమిలి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఫెన్సింగ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక శుక్రవారం జరిగింది. మారికవలసలోని పాలెక్స్ ఇంటెల్లీ స్కూల్లో జరిగిన ఈ ఎంపికకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

బాలికల విభాగంలో 11, బాలురు విభాగంలో 11 మొత్తం 22 మందితో రాష్ట్ర పోటీలకు రెండు జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా ఫెన్సింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పదిలం త్రినాథరావు తెలిపారు. పోటీలను పాలెక్స్ ఇంటెల్లీ స్కూల్ డైరెక్టర్స్ రజని చిత్ర, శ్రీలత ప్రారంభించారు. పరిశీలకులుగా ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, చరణ్ వ్యవహరించారు. కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు శని, ఆదివారాల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే 9వ ఆంధ్ర రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు.



ఫెన్సింగ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జాతి శునకాలకు రిజిస్ట్రేషన్ డ్రైవ్ నేడు

డాబాగార్డెన్స్: విశాఖ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతి శునకాలకు శనివారం కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా(కేసీఐ) రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపడుతోంది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు నారాయణరెడ్డి, శ్రీకృష్ణ, సురేష్ సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న శునకానికి మైక్రోచిప్, కేసీఐ ఓనర్‌షిప్ సర్టిఫికెట్, ఏడాది పాటు కెన్నెల్ మ్యాగజైన్ ఉచితంగా ఇవ్వడంతో పాటు అక్టోబర్ 8న నిర్వహించనున్న నేషనల్ డాగ్ షోకి ఉచితంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. నగరంలోని జడ్జి కోర్టు సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ఎదురుగా గల సంతోష్ పెట్ నీడ్స్‌లో ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99496 67799, 92919 01303 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

నేడు తెలంగాణ మంత్రి భీమిలి రాక

మహారాణిపేట: తెలంగాణ ఎస్టీ సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం ఉదయం 10.30 గంటలకు భీమిలి వస్తున్నారు. నేరెళ్లవలసలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విమానంలో తిరిగి హైదరాబాద్ వెళతారు.

లలితా పీఠంలో అష్టలక్ష్మీ మహాయాగం



పీఠంలో స్థాపన చేసిన అష్టలక్ష్మి రూపాలు

సీతంపేట: శ్రీ లలితా పీఠంలో అష్ట పద్మ కుండాత్మక అష్ట లక్ష్మీ మహాయాగం శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రుత్విక్‌ల వేద మంత్రాల మధ్య యాగం మొదలయింది. కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో రుత్విక్‌లు వేదమంత్రాలతో మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, రక్షాబంధన, అఖండ దీపస్థాపన, అగ్ని మథనం, కలశస్థాపన, రక్షోఘ్నహోమం, గణపతి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో బంగారు వర్ణంలో అలంకరించిన వేదికపై అష్టలక్ష్మి రూపాలను, కలశాలను స్థాపన చేశారు. ఈ విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాచవోలు శివ నివేదిత చేసిన నృత్య ప్రదర్శన ఆహూతుల్ని అలరించింది. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.



శ్రీలలితా పీఠంలో అష్టలక్ష్మీ మహాయాగం ప్రారంభిస్తున్న రుత్విక్‌లు

హత్య కేసులో తండ్రీ, కొడుకులకు రెండేళ్ల జైలు

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో తండ్రీ, కొడుకులకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2014 సంవత్సరంలో బర్మా క్యాంప్ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన తండ్రీ కొడుకులు కాకి ఈశ్వరరావు, శ్రీనులకు అదే ప్రాంతానికి చెందిన కె.వెంకటరమణకు మధ్య ఆర్థిక లావాదేవీల కారణంగా ఘర్షణ జరిగింది. సదరు తండ్రీ, కొడుకులు వెంకటరమణపై దాడి చేసి, గాయపరిచారు. వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వెంకటరమణను డాక్టర్లు పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య మొల్లమాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి ఈశ్వరరావు, శ్రీనును రిమాండ్‌కు తరలించారు. తరువాత ఇద్దరూ బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం 4వ ఏడీజే కోర్టు తండ్రీ కొడుకులకు రెండేళ్ల శిక్ష విధించినట్టు పోలీసులు తెలిపారు.

కుమార్తె తొలి పుట్టిన రోజు చూడకుండానే

- విద్యుదాఘాతంతో ఆర్మీ ఉద్యోగి మృతి
- విధుల్లో ఉండగా జమ్ములో ఘటన



కొల్లి పూర రామచంద్రారెడ్డి(ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస రెడ్డి వీధికి చెందిన ఆర్మీ ఉద్యోగి కొల్లి పూర్ణ రామచంద్రారెడ్డి(33) జమ్ములో శుక్రవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. జమ్ములోని సిగ్నల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తుండగా ఉదయం 10.30 సమయంలో తెగిపడిన విద్యుత్ వైర్లను గుర్తించకపోవడంతో అవి తగిలి మృత్యువాత పడినట్టు అతని బంధువులు తెలిపారు. ఆ సమయంలో విపరీతమైన మంచు కురుస్తుందని వివరించారు. రామచంద్రారెడ్డికి విజయనగరం జిల్లా భోగాపురం మండలం పాత చెరకుపల్లికి చెందిన భవానీలక్ష్మితో 2020 ఫిబ్రవరిలో వివాహమైంది. వీరికి రేష్మ అనే 11 నెలల కుమార్తె ఉంది. కుమార్తె మొదటి పుట్టినరోజు ఘనంగా నిర్వహించేందుకు ఈ నెల 28న వస్తున్నట్టు ఇటీవల కుటుంబ సభ్యులకు సమాచారం కూడా అందించాడు. మృతుని తల్లిదండ్రులు వెంకటరమణ, మంగమ్మలకు ఇద్దరు సంతానం లో పూర్ణ రామచంద్రారెడ్డితో పాటు వివాహమైన మరో కుమార్తె ఉంది. ఈ నెల 19న మృతుని పుట్టినరోజు. కాగా పూర్ణ భౌతిక కాయం శనివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో జమ్ము నుంచి విశాఖ రానుంది. ఆదివారం చిట్టివలస గోస్తనీనది తీరంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



షేక్ నాగూర్ సాహెబ్(ఫైల్)

పెదగంట్యాడ(గాజువాక): పాత గంగవరం తీరంలో ఈ నెల 8న గల్లంతైన యువకుడు షేక్ నాగూర్ సాహెబ్(24) మృతి చెందాడు. ఆయన మృతదేహం శుక్రవారం ఉదయం పాత గంగవరం తీరానికి కొట్టుకొచ్చింది. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ సువ్వారి రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కరప మండలం కొత్తపేటకు చెందిన షేక్ నాగూర్ సాహెబ్ గాజువాకలోని కుంచుమాంబ కాలనీలో అన్నయ్యతో కలసి నివాసం ఉంటున్నాడు. తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన గాజువాక కుంచుమాంబ కాలనీకి చెందిన స్నేహితులతో కలసి ఈ నెల 8న పాత గంగవరం తీరానికి వెళ్లారు. సరదాగా స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అయితే ఒక్కసారిగా పెద్ద అల రావడంతో నాగూర్ సాహెబ్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అతన్ని రక్షించాలని తోటి స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సోదరుడు బషీర్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. మూడు రోజుల పాటు కోస్టుగార్డులతో కలసి నేవీ సిబ్బంది హెలికాప్టర్‌లో సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం గల్లంతైన చోటే పాత గంగవరం తీరానికి మృతదేహం కొట్టుకొచ్చింది. గమనించిన మృతుని స్నేహితులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

తల్లీ, ఇద్దరు పిల్లల ఆత్మహత్యపై ముమ్మర దర్యాప్తు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో తల్లీ ఇద్దరు పిల్లల ఆత్మహత్య ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు ఆటో డ్రైవర్ బడగ రవికుమార్‌పై అనుమానంతో విచారించారు. రవికుమార్‌ది రైల్వే న్యూకాలనీ. ఈయన తన భార్యను విడిచిపెట్టేసి, మరో యువతితో నాయుడుతోటలో ప్రస్తుతం నివాసముంటున్నాడు. స్కూల్‌కు పిల్లలను తీసుకెళ్లడానికి ఆటో బాడుగ కోసం వెతుకుతున్న సమయంలో రవికుమార్‌కు మృతురాలు సంధ్య పరిచయమైంది. అప్పటి నుంచి 9 నెలలుగా ఆటో డ్రైవర్‌తో ఆమె 1700 సార్లు సెల్‌ఫోన్లో మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. అందులో సుమారు 900 సార్లు ఆటో డ్రైవర్ మృతురాలికి ఫోన్ చేసినట్లుగా తెలుస్తోంది. అయితే పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లొచ్చే సమయంలోనే ఎక్కువ శాతం మాట్లాడినట్లుగా గుర్తించారు. దీంతో వారి మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్టు అనుమానిస్తున్నారు. ఘటన రోజు మృతురాలు రాత్రి 11 గంటల సమయంలో ఆటో డ్రైవర్ రవికుమార్‌కు ఫోన్ చేసినా ఆయన ఎత్తలేదని సీఐ బీఎండీ ప్రసాద్ చెప్పారు. చుట్టు పక్కల సీసీటీవీ ఫుటేజీలను సైతం పరిశీలిస్తున్నారు. మృతురాలి ఫోన్ సంపులో పడిపోవడంతో దాన్ని వెలికి తీసి ఆ ఫోన్‌లో డేటాను రికవరీ చేస్తున్నారు. అందులో వచ్చిన సమాచారాన్ని బట్టి దర్యాప్తు మరింత వేగవంతమవుతుందని పోలీసులు చెబుతున్నారు. అలాగే మరో కోణంలో మృతురాలి భర్త పెద్దమ్మ కుమారుడిని కూడా తీసుకొచ్చి విచారించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పిల్లల్ని చంపి తాను బలవన్మరణానికి పాల్పడిన స్థాయిలో ఉన్న కారణాలు అంతు పట్టని విధంగా ఉన్నాయని పోలీసులు విస్తుపోతున్నారు. మృతికి గల కారణాలపై పలు కోణాల్లో విచారిస్తున్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): వెంకోజీపాలెం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై ఓ కారు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎండాడకు చెందిన గేదెల వెంకటరమణ భార్యతో కలిసి సీతమ్మధార నుంచి మారుతీ వేగనార్ ఏపీ39 ఎస్ఎస్2489 కారులో ఎండాడ వెళ్తున్నారు. వెంకోజీపాలెం కూడలి దాటి కొంత దూరం వెళ్లేసరికి కారు ఇంజిన్‌లో పొగలు రావడాన్ని గుర్తించిన రమణ అప్రమత్తమై వెంటనే కిందికి దిగిపోయారు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో క్షణాల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఆ పక్కనే ఉన్న పండ్ల విక్రయదారుడి బడ్డీ కూడా కాలిబూడిదైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చిన మంటలను అదుపు చేశారు. ఈ ఘటన కారణంగా కొద్దిసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా అత్యవసర వాహనాల నిర్వహణ



వర ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు, సిబ్బంది

మహారాణిపేట: అత్యవసర సమయాల్లో ప్రజలకు ఉపయోగపడే 108, 104 వాహనాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆ విభాగం రాష్ట్ర ఫ్లీట్ హెడ్(ఆపరేషన్) వరప్రసాదరావు సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎమర్జెన్సీ సేవలందిస్తున్న 108, మొబైల్ మెడికల్ సేవలు అందిస్తున్న 104 వాహనాల పనితీరుపై ఆయన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వాహనాల్లో అన్ని సౌకర్యాలు పక్కాగా ఉండాలని, వాహనాలు మరమ్మతులకు గురైతే తక్షణమే చేయించాలని వరప్రసాదరావు సూచించారు. అత్యవసర మందులను అన్ని వేళల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా మేనేజర్ త్రినాథ్, సిటీ కోఆర్డినేటర్ ఎం.సురేష్, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, అధికారులు రవికిరణ్, జగ్గరాజు పాల్గొన్నారు.

వ్యవసాయం తర్వాత పరిశ్రమల్లోనే ఉపాధి

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి ఆధారిత స్థానం పరిశ్రమలదేనని లఘు ఉద్యోగ భారతి ఏపీ అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో లఘు ఉద్యోగ భారతి వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సూక్ష్మ పరిశ్రమల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రకాష్ చంద్రజీ మాట్లాడుతూ సూక్ష్మ ఆధారిత రంగం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న వారి అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందజేయడమే లఘు ఉద్యోగ భారతి లక్ష్యమన్నారు. వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగప్రసాద్ మాట్లాడుతూ ఆటోనగర్‌లోని పరిశ్రమల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ జనరల్(ఎన్ఎస్ అండ్ ఎం) డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, పూడి టెక్నాలజీ సెంటర్ డీజీఎం ప్రసాద్‌రెడ్డి, ఎస్ఎస్ అండ్ ఎం ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, విజయనగరానికి చెందిన ఐలా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాష్ చంద్రజీ

20, 27 తేదీలో హిందీ ప్రీ ప్రైమరీ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి ఈ నెల 20, 27 తేదీల్లో ప్రీ ప్రైమరీ పరీక్షలు జరుగుతాయి. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్ధ, ప్రవీణ పూర్వార్ధ, ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు రెండో పేపర్, 27వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూడో పేపర్ పరీక్ష నిర్వహిస్తారు.

- లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక పరీక్షలు 27వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 వరకు మొదటి పేపర్, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు రెండో పేపర్ నిర్వహించనున్నారు. భీమిలిలో నిర్వహించే ఈ పరీక్షల వివరాలకు 89858 97419, 89856 47419 నంబర్లలో సంప్రదించాలని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.